వడ్ల సంఘం మండలాధ్యక్షుడిగా జనార్దన్ చారి

భైంసా, అక్టోబర్ 3 : భైంసా మండలం వడ్ల సంఘం అధ్యక్షుడిగా జనార్దన్ చారిని నియమించారు. రాష్ట్ర కమిటీ వారు ఈ నిర్ణయం తీసుకొని నియామక పత్రాన్ని అందజేసినట్లు ఆయన తెలిపారు.

మిషన్ భగీరథ పైపులైన్‌పై శిక్షణ

తలమడుగు, అక్టోబర్ 3 : మండల కేంద్రంలోని రైతు వేదికలో మంచినీటి సహాయకులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీలను ఎలా మరమ్మతులు చేయాలో వివరించారు. కార్యక్రమంలో ఈఈ చంద్రమోహన్, ఎంపీడీవో చంద్రశేఖర్, ఎంపీఓ సుధీర్ రెడ్డి, ఏఈఈ, టీఓటీ, కార్యదర్శులు పాల్గొన్నారు.

ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలి

కుభీర్, అక్టోబర్ 3 : కుభీర్ మండలం మాలేగావ్ గ్రామానికి చెందిన మైనర్ బాలికకు మాయమాటలు చెప్పి భైంసాకు తీసుకెళ్లిన కుభీర్‌కు చెందిన యువకుడిపై ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని హిందూధర్మ పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో గురువారం పలువురు ఎస్ఐ, తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ఉండేందుకు గాను శిక్ష పడే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఇక్కడ పడిపెల్లి గంగాధర్, ఏశాల దత్తాత్రి, అభిషేక్, మల్లేశ్, కమలేశ్, జాదవ్ పండిత్, అజయ్, నరేశ్, శేఖర్, శంకర్, రమాకాంత్, గణేశ్, శ్రీనివాస్, పోశెట్టి, రాజు ఉన్నారు.

ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత

బోథ్, అక్టోబర్ 3 : ఆధ్యాత్మికతతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని ఆదిలాబాద్ ఎంపీ నగేశ్ అన్నారు. గురువారం సొనాల గ్రామంలోని రామాలయంలో శ్రీ రామరథానికి శాస్త్రోక్తంగా యజ్ఞం, పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ హాజరై రథాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో రామాలయ కమిటీ చైర్మన్ జీవీ రమణ, మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్, మాజీ సర్పంచ్ సదానందం, ఆలయ కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

బీజేపీ సభ్యత్వ నమోదు ప్రారంభం

సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఎంపీ నగేశ్

గుడిహత్నూర్, అక్టోబర్ 3 : గుడిహత్నూర్‌లో నిర్వహించిన ఆన్‌లైన్ ద్వారా బీజేపీ సభ్యత్వ నమోదును ఎంపీ నగేశ్ ప్రారంభించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పతాంగే బ్రహ్మానంద్, జిల్లా అధికార ప్రతినిధి లక్ష్మణ్, నాయకులు డాక్టర్ శివాజీ, వామన్‌గిత్తే, విజయ్, జగన్, సంబాజీ, మహేశ్ పాల్గొన్నారు.

కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలి

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 3 : కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రి కావాలని బీఆర్ఎస్ నాయకుడు బదావత్ పూర్ణచందర్ నాయక్ అన్నారు. దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని బెజవాడ కనక దుర్గమ్మ సన్నిధిలో ప్రత్యేక పూజలు నిర్వహించి దీక్ష చేపట్టారు. కేసీఆర్ ముఖ్యమంత్రి కావాలని, రాష్ట్ర ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని తాను దుర్గమ్మ దీక్ష తీసుకున్నట్టు తెలిపారు.

పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు రిజిస్ట్రేషన్ చేసుకోవాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్, మెదక్ పట్టభద్రులు ఎమ్మెల్సీ ఓటరు నమోదు చేసుకోవాలని బీజేపీ జిల్లా ఇన్‌చార్జి జనార్దన్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంజుకుమార్‌రెడ్డి అన్నారు. గురువారం ఉద్యోగ విశ్రాంతి భవనంలో నిర్మల్ అసెంబ్లీ బీజేపీ సన్నాహక సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ వైఫల్యాలపై పట్టభద్రులను చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు రాంరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, సత్యనారాయణ గౌడ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

బోథ్, అక్టోబర్ 3 : సొనాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు కోసం మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్ స్థలాన్ని పరిశీలించారు. లైట్ల ఏర్పాటు కోసం మండల పరిషత్ నిధులను ఇది వరకే మంజూరు చేశారు. జడ్పీ పాఠశాలతో పాటు బుద్ధ విహార్‌లో రూ.1.25 లక్షలతో వీటిని ఏర్పాటు చేయనున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఓస శ్రీనివాస్, ఆర్ మధుసూదన్, అభిలాష్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

ఫ్యామిలీ డిజిటల్ కార్డుకు గోండ్‌హర్కాపూర్ ఎంపిక

గుడిహత్నూర్, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు పంపిణీలో భాగంగా ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమానికి గుడిహత్నూర్ మండలం గోండ్‌హర్కాపూర్ పంచాయతీని ఎంపిక చేశారు. ఇందులో భాగంగా గురువారం జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో కలనందిని హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీవో అబ్దుల్ హై, ఈవోపీఆర్డీ దిలీప్, పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ పరిశీలన

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : నిర్మల్ జిల్లా కొండాపూర్‌లోని సెయింట్ థామస్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న డీఎస్సీ మెరిట్ లిస్ట్ అభ్యర్థుల సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియను గురువారం డీఈవో రవీందర్‌రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ 1:3 నిష్పత్తిలో అభ్యర్థుల ధ్రువపత్రాలను పరిశీలించడం జరుగుతుందని తెలిపారు. అధికారులకు పలు సలహాలు, సూచనలు చేశారు.

గ్రంథాలయానికి పోటీ పరీక్షల పుస్తకాల వితరణ

ఖానాపూర్, అక్టోబర్ 3 : ఖానాపూర్‌లోని శాఖ గ్రంథాలయానికి రూ. 20 వేల పోటీ పరీక్షల పుస్తకాలను విన్నర్ పబ్లికేషన్ అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రసన్నహరికృష్ణ గురువారం విరాళంగా అందజేశారు. కార్యక్రమంలో లైబ్రేరియన్ పృథ్వీ, వేణుగోపాల్, విజేందర్, పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

తాంసి(భీంపూర్), అక్టోబర్ 3 : భీంపూర్ మండలం ఇందూర్‌పల్లిలో ఐటీడీఏ నిధులతో నిర్మించిన అంగన్‌వాడీ భవనానికి గురువారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముంతాజ్, కార్యదర్శి వేణుగోపాల్, మాజీ సర్పంచ్ దాదారావ్, అంగన్‌వాడీ కార్యకర్తలు పద్మ, కవిత, సునీత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి

ఎదులాపురం, అక్టోబర్ 3 : బేల గ్రామ పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు కలెక్టర్ రాజర్షి షాకు వినతి పత్రం అందజేశారు. చట్టానికి విరుద్ధంగా కుమ్రం సూరు జెండా, రాంజీగోండ్ జెండాలను తొలగించిన బేల గ్రామ పంచాయతీ కార్యదర్శి సురేశ్‌పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేశారు. వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా ఆదివాసీ సంక్షేమ పరిషత్ అధ్యక్షుడు శంకర్, ఆదివాసీ విద్యార్థి సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు నైతం బాలు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండలాధ్యక్షుడు నందుకుమార్, కొలాం సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి గోవింద్, ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా ఆదిలాబాద్ ప్రధాన కార్యదర్శి సెడ్మాకి రామారావ్ ఉన్నారు.

తులం బంగారం ఉత్తదేనా ?

- బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్
- నేరడిగొండలో కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

నేరడిగొండ, అక్టోబర్ 3 : కాంగ్రెస్ ప్రభుత్వం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని చెప్పిన మాట ఉత్తదేనా అని బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ మండిపడ్డారు. గురువారం నేరడిగొండలోని ఎమ్మెల్యే నివాసంలో 23 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో పెండ్లి చేసే ఆడబిడ్డలకు లక్ష రూపాయలతో పాటు తులం బంగారం ఇస్తామని అబద్ధపు మాటలు చెప్పి అది ఇప్పటికీ అమలు చేయకుండా మోసం చేశారని మండిపడ్డారు. రాష్ట్రంలో పేదింటి ఆడబిడ్డల పెళ్లి ఖర్చులు భారం కాకూడదని మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తన సొంత ఆలోచనతో తెచ్చిన గొప్ప అవకాశమని పేర్కొన్నారు. రూ.2 లక్షల రుణాలు, రైతు భరోసా వంటి పథకాలతో పాటు ఆసరా పింఛన్, కల్యాణలక్ష్మి, షాదీముబారక్ వంటి పథకాలను ఎక్కువ చేసి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతులు, ప్రజలు గుణపాఠం చెబుతారన్నారు. రాష్ట్రంలో ప్రజలకు భద్రతను గాలికి వదిలేసి, కాంట్రాక్టుల పేరుతో వారి జేబులు నింపుకునే పనిలో పడ్డారని విమర్శించారు. హైడ్రా పేరుతో ఎంతో మంది పేద ప్రజలను రోడ్డున పడేశారని మండిపడ్డారు. ప్రజాపాలన అంటే పేద ప్రజలు పొట్టగొట్టడమేనా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ నాయకులు ప్రశ్నిస్తే సమాధానం చెప్పే దమ్ములేక వ్యక్తిగత విమర్శలకు దిగుతున్నారని విమర్శించారు. ఇప్పటికైన వ్యక్తిగత ప్రయోజనాలకు వెళ్లకుండా ప్రజాప్రయోజనాలను దృష్టి పెట్టుకొని ఇచ్చిన ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రాథోడ్ సజన్, బీఆర్ఎస్ మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, పీఏసీఎస్ మాజీ చైర్మన్ సాబ్లె నానక్‌సింగ్, మాజీ సర్పంచ్ వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ దేవేందర్‌రెడ్డి, నాయకులు రాథోడ్ సురేందర్, సద్దాం, తహసీల్దార్ ఎంఎ అలీం, ఆర్ఐ నాగోరావ్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరడిగొండ: కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్

బోథ్ ఎమ్మెల్యేకు సన్మానం

ఎదులాపురం, అక్టోబర్ 3: ఆదిలాబాద్ పీఆర్టీయూ నూతన కార్యవర్గం ఇటీవల ఏర్పడిన విషయం తెలిసిందే. గురువారం ఆదిలాబాద్‌లోని పీఆర్టీయూ టీఎస్ భవన్‌లో సభ్యులు బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు స్వాగతం పలికి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎన్నికైన కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

జగదంబాదేవి ఆలయంలో ఎమ్మెల్యే దంపతుల పూజలు

నేరడిగొండ, అక్టోబర్ 3 : రాజురా గ్రామంలోని జగదంబాదేవి ఆలయంలో ఎమ్మెల్యే జాదవ్ అనిల్ దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం కావడంతో బాలత్రిపుర సుందరి దేవి అవతారంలో అమ్మవారికి వేదపండితులు శ్రావణ్‌కుమార్ జోషి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం హోమం నిర్వహించి, అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. ఈ కార్యక్రమానికి భక్తులు పాల్గొని అమ్మవారి ఆశీర్వాదం తీసుకున్నారు.

వన్యప్రాణుల సంరక్షణకు కృషి చేయాలి

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : వన్యప్రాణుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బాసర సర్కిల్ సీసీఎఫ్ శర్వానన్ అన్నారు. వన్యప్రాణి వారోత్సవాల సందర్భంగా గురువారం నిర్మల్‌లో అటవీ కార్యాలయం నుంచి అర్బన్ ఫారెస్ట్ వరకు తీసిన బైక్ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మొక్కలు నాటారు. కార్యక్రమంలో డీఎఫ్‌వో షేక్ నాగిని భాను, అటవీ శాఖ అధికారులు రవీందర్, రామకృష్ణ, శ్రీనివాస్, అనిత, వేణుగోపాల్ పాల్గొన్నారు.

ఖానాపూర్ టౌన్, అక్టోబర్ 3: ఖానాపూర్ అటవీ డివిజన్ ఆధ్వర్యంలో గురువారం వన్యప్రాణి సప్త వారోత్సవాలు నిర్వహించారు. అడవుల ప్రాముఖ్యత, వన్యప్రాణుల సంరక్షణ, మొక్కల పెంపకం వంటి అంశాలపై వారం రోజుల పాటు ఖానాపూర్ రేంజ్ పరిధిలో ఆయా కార్యక్రమాలు నిర్వహిస్తామని ఖానాపూర్ ఎఫ్ఆర్‌వో కిరణ్ కుమార్ అన్నారు. అనంతరం బైక్ ర్యాలీని ప్రారంభించారు. కార్యక్రమంలో డీఆర్‌వో మహేశ్, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు పాల్గొన్నారు.

కడెం, అక్టోబర్ 3: అడవుల సంరక్షణ అందరి బాధ్యత అని ఎఫ్ఆర్వో గీతారాణి అన్నారు. వన్యప్రాణి సప్త వారోత్సవాల్లో భాగంగా కడెంలో అధికారులు సేవ్ ద టైగర్, సేవ్ ద నేషన్ నినాదాలతో ర్యాలీ తీశారు. కార్యక్రమంలో సెక్షన్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేరడిగొండ, అక్టోబర్ 3 : అటవీ ప్రాంతాల్లో వన్య ప్రాణుల రక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతగా భావించాలని సిరిచెల్మ రేంజ్ అధికారి అరుణ్ అన్నారు. కుంటాల జలపాతం వద్ద వన్యప్రాణి సప్త వారోత్సవాలు భాగంగా ప్లాస్టిక్ కవర్లు, బాటిళ్లు, ఏరివేసే కార్యక్రమాన్ని చేపట్టారు. అనంతరం వన్యప్రాణుల ప్రాముఖ్య గురించి గ్రామస్తులు, సందర్శకులకు రేంజ్ అధికారి వివరించారు. కార్యక్రమంలో కుంటాల సెక్షన్ అధికారి వసంత్‌కుమార్, ఎఫ్‌బీవో సచిన్, సందీప్, పోచం, వీడీసీ చైర్మన్ నర్సయ్య, వైస్ చైర్మన్ రమేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

కొలువుదీరిన దుర్గమ్మ

ఆదిలాబాద్‌లోని రాంనగర్‌లో పూజలు చేస్తున్న మహిళలు

ఆదిలాబాద్, నిర్మల్ జిల్లాల వ్యాప్తంగా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం దుర్గామాత విగ్రహాలు ఏర్పాటు చేసి ప్రజలు భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. అమ్మవారి మాలధారణ చేశారు.

-నమస్తే నెట్‌వర్క్, అక్టోబర్ 3

మూడో రోజు మున్సిపల్ కార్మికుల నిరసన

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : తమకు మూడు నెలలుగా వేతనాలు చెల్లించడం లేదని డిమాండ్ చేస్తూ కాంట్రాక్ట్ కార్మికులు గురువారం మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నెలనెల వేతనాలు ఇవ్వకపోవడంతో కుటుంబపోషణ భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వేతనాలు చెల్లించాలని అన్నారు. మూడు రోజులుగా సమ్మె చేస్తున్న అధికారులు పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

సారంగాపూర్, అక్టోబర్ 3: చిన్న పిల్లలు అనారోగ్యానికి గురైనప్పుడు అంబులెన్స్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ వేదవ్యాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో అంబులెన్స్ జిల్లా మేనేజర్ లింగాచారి, ఈఎంటీలు నవీన్, సాగర్, పైలెట్లు సతీశ్, జ్ఞానేశ్వర్, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు

జైనథ్, అక్టోబర్ 3 : ఆదిలాబాద్ నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో రూ.13.50 లక్షలతో చేపడుతున్న పాఠశాల అదనపు గదుల నిర్మాణానికి అధికారులు నాయకులతో కలిసి ఎమ్మెల్యే భూమి పూజ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం లస్మన్న, పీడీ దయానంద్ రెడ్డి, నాయకులు రాకేశ్ రెడ్డి, ప్రతాప్ యాదవ్, రమేశ్ రెడ్డి, సత్యనారాయణ, విజయ్, లస్మన్న, ముకుంద్‌రావ్ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు అందాలి

ఎదులాపురం, అక్టోబర్ 3 : ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేరుగా లబ్దిదారులకు అందాలని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ అన్నారు. గురువారం జడ్పీ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ నియోజకవర్గ పరిధిలో182 మంది లబ్దిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బండారి సతీశ్, లాలామున్న, ఆకుల ప్రవీణ్, సతీశ్‌యాదవ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహాలక్ష్మీ ఆలయం సందర్శన

నిర్మల్ అర్బన్, అక్టోబర్ 3 : నిర్మల్‌లోని బంగాల్‌పేట్ మహాలక్ష్మీ అమ్మవారి ఆలయాన్ని గురువారం ఎస్పీ జానకి షర్మిల దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం దసరా ఉత్సవాలు నిర్వహించే స్థలాన్ని పరిశీలించారు. శాంతియుతంగా ఉత్సవాలు జరిగేలా చూడాలని ఆలయ కమిటీకి సూచించారు. ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ఆమె వెంట మున్సిపల్ చైర్మన్ ఈశ్వర్, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు అంజుకుమార్ రెడ్డి, అయ్యన్నగారి భూమయ్య, రాజేందర్ ఉన్నారు.

ముగిసిన సంబురం



బతుకమ్మలతో మహిళలు

బజార్‌హత్నూర్, అక్టోబర్ 3: బజార్‌హత్నూర్‌లో పొలాల అమావాస్యను పురస్కరించుకొని బతుకమ్మ వేడుకలు ప్రారంభమయ్యాయి. దేవి నవరాత్రుల ప్రారంభంతో ముగిశాయి. రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చారు. స్థానిక హనుమాన్ ఆలయ ప్రాంగణం నుంచి ప్రధాన వీధుల గుండా డీజే పాటలపై కోలాటాలు, నృత్యాలు చేస్తూ గ్రామ సమీపంలోని కడెం వాగులో బతుకమ్మలను నిమజ్జనం చేశారు.

యువకుడి ఆత్మహత్య

కుంటాల, అక్టోబర్ 3: లింబా (కే) గ్రామానికి చెందిన బోరగం రమేశ్ (42) ఆర్థిక ఇబ్బందులు భరించలేక మద్యానికి బానిసై బుధవారం అర్ధరాత్రి తన రేకుల ఇంటిలోని దులానికి లుంగీతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్టు ఎస్ఐ భాస్కరాచారి తెలిపారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం..ఓ మహిళతో పదేళ్లకు పైగా సహజీవనం చేస్తున్న రమేశ్ వడ్రంగి పని చేస్తూ జీవనం గడుపుతుండేవాడు. గత కొంతకాలం నుంచి పనులు లేకపోవడంతో ఆర్థికంగా ఇబ్బందులు పడ్డాడు. దీంతో మనస్థాపం చెంది బలవన్మరణానికి పాల్పడ్డాడు. అతని కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వైన్స్ షాపులో సీసీ కెమెరాల చోరీ

తాంసి, అక్టోబర్ 3: తాంసిలోని వైన్స్ షాప్ ఎదుట అమర్చిన సీసీ కెమెరాలను బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. రెండు సీసీ కెమెరాలు చోరీ చేయగా మరో సీసీ కెమెరాను రాళ్లతో పగలగొట్టారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శివరాం తెలిపారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ఎదులాపురం, అక్టోబర్ 3 : మావలలోని చిలుకూరి గార్డెన్ వద్ద గుర్తు తెలియని మృతదేహాన్ని పోలీసులు గురువారం గుర్తించారు. ఆ ప్రాంతంలో భిక్షాటన చేసే దాదాపు 55 సంవత్సరాల వయస్సున్న వ్యక్తి మృతి చెందినట్లు మావల ఎస్ఐ విష్ణువర్ధన్ తెలిపారు. అనారోగ్యం బారిన పడి మృతి చెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఆదిలాబాద్ రిమ్స్ మార్చురికి తరలించామన్నారు. సంబంధికులు ఎవరైనా వస్తే మృతదేహాన్ని అప్పగిస్తామన్నారు. ఇతర వివరాల కోసం ఎస్ఐ 8712659925 నంబర్‌ను సంప్రదించాలన్నారు.

డీజే వినియోగంపై నిషేధం

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : నిర్మల్ జిల్లా పరిధిలో మత పరమైన ఊరేగింపుల్లో డీజే వినియోగంపై నిషేధం విధిస్తూ కలెక్టర్ అభిలాష అభినవ్, ఎస్పీ జానకి షర్మిల ఉత్తర్వులు జారీ చేశారు. డీజేల నుంచి అధిక డెసిబెల్స్‌తో ఉత్పన్నమయ్యే శబ్దాల కారణంగా హృద్రోగులు గుండెపోటు, ఇతర హృదయ సంబంధ ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉండడంతో పాటు చిన్న పిల్లలకు శాశ్వత వినికిడి సంబంధ సమస్యలు ఏర్పడే అవకాశం ఉందన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే పోలీస్ యాక్ట్ ప్రకారం కేసులు నమోదు చేస్తామని తెలిపారు.

మీ సేవ కేంద్రం ప్రారంభం

ఉట్నూర్ రూరల్, అక్టోబర్ 3 : గ్రామీణ ప్రాంతాల్లో మీ సేవ ఏర్పాటు చేయడం వల్ల ప్రజలకు మరింత సౌకర్యవంతంగా ఉంటుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. దంతన్‌పల్లి గ్రామంలో మీ సేవ కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు చంద్రయ్య, ముబిన్, షరీఫ్ పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా నిర్వహించాలి

ఎదులాపురం: సర్వేను పరిశీలిస్తున్న ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్

ఎదులాపురం, అక్టోబర్ 3 : ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీకై పైలెట్ ప్రాజెక్టులో భాగంగా చేపడుతున్న సర్వేను పకడ్బందీగా నిర్వహించాలని ఆదిలాబాద్ ఆర్డీవో వినోద్‌కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని 11వ వార్డు రాంనగర్‌లో చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రక్రియ సర్వేను ఆదిలాబాద్ ఆర్డీవో పరిశీలించారు. కార్యక్రమంలో ఆదిలాబాద్ తహసీల్దార్ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ఖమర్ అహ్మద్, డిప్యూటీ తహసీల్దార్ బాబుసింగ్, ఆర్ఐ యజ్వేందర్ రెడ్డి, వార్డు ఆఫీసర్ చంటన్న, రాంనగర్ రేషన్ డీలర్ అనిల్ కుమార్ పాల్గొన్నారు.

భైంసా, అక్టోబర్ 3 : భైంసాలోని 24వ వార్డులో డిజిటల్ కార్డులపై సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో కోమల్ రెడ్డి మాట్లాడుతూ పైలట్ ప్రాజెక్టుగా భైంసాలో 24వ వార్డును ఎంపిక చేశారని, ఎలాంటి పొరపాట్లు లేకుండా పకడ్బందీగా సర్వే పూర్తి చేయాలన్నారు. ఆయన వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

ఇచ్చోడ, అక్టోబర్ 3 : అడిగామ(బీ) గ్రామంలో గురువారం తహసీల్దార్ సత్యనారాయణరావ్, ఎంపీడీవో లక్ష్మణ్ ఆధ్వర్యంలో డిజిటల్ సర్వేను ప్రారంభించారు. ఇంటింటికీ తిరుగుతూ కుటుంబ సభ్యుల వివరాలు సేకరించారు. కార్యక్రమలో డిప్యూటీ తహసీల్దార్ రమేశ్, ఎంపీఎస్‌వో ప్రసాద్, పంచాయతీ కార్యదర్శులు హిమబిందు, పురుషోత్తం పాల్గొన్నారు.

రెండో వార్షిక బెటాలియన్ స్పోర్ట్స్ మీట్

క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న కమాండెంట్ నితికా పంత్

ఎదులాపురం, అక్టోబర్ 3 : రెండో వార్షిక బెటాలియన్ స్పోర్ట్స్ మీట్–2024కు గురువారం కమాండెంట్ నితికా పంత్ ముఖ్యఅతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. ఆమె మాట్లాడుతూ.. శారీరక దృఢత్వంతోపాటు జట్టు కృషిని ప్రోత్సహించడానికి వివిధ ఈవెంట్‌లు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.

కాంగ్రెస్ సభ్యత్వం తీసుకుంటేనే పథకాలు

కడెం, అక్టోబర్ 3 : మండలంలోని పెద్దబెల్లాల్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఎస్సీ కాలనీకి చెందిన మహిళలతో కాంగ్రెస్ నాయకురాలు దుర్గ భవాని సమావేశం నిర్వహించారు. పథకాలు వర్తించాలంటే కాంగ్రెస్ పార్టీ సభ్యత్వం పొందాలని, బలవంతంగా రూ. 100 చొప్పున వసూలు చేస్తూ ప్రజలతో సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. అదే గ్రామానికి చెందిన బీఆర్ఎస్ నాయకుడు సన్ని అక్కడికి చేరుకున్నాడు. సభ్యత్వం పొందితేనే పథకాలు వర్తిసాయంటూ ప్రజలను తప్పుదోవ పట్టించడం ఏమిటని కాంగ్రెస్ నాయకురాలు దుర్గ భవానిని ప్రశ్నించారు. దీంతో ఆమె తాను ఖానాపూర్ మార్కెట్ కమిటీకి కాబోయే చైర్‌పర్సన్ అని, తన దగ్గర సభ్యత్వం పొందితేనే పథకాలు వస్తాయంటూ ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేశారు. బీఆర్ఎస్ నాయకులు అక్కడికి చేరుకొని ప్రజలకు విషయం విన్నవించడంతో అక్కడి నుంచి వారు వెనుదిరిగారు.

గిరిజనులకు మెరుగైన వైద్యసేవలందించాలి

ఉట్నూర్, అక్టోబర్ 3: గిరిజనులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు దవాఖానలను బలోపేతం చేయాలని మంత్రి దామోదర రాజనర్సింహ, ట్రైకార్ చైర్మన్ బెల్లయ్య నాయక్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సంజీవయ్య భవన్‌లోని గిరిజన సంక్షేమ శాఖ కార్యాలయంలో ఉట్నూర్, భద్రాచలం, ఏటునాగారం, మన్ననూర్ పీవో, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు ప్రతి చెంచుపెంట, గిరిజన గూడేల్లో నివసించే వారికి మెరుగైన వైద్యం అందేలా అధికారులు కార్యాచరణ రూపొందించాలన్నారు. వైద్య అత్యవసర పరిస్థితుల్లో అరగంట లోపే ఆరోగ్య ఉప కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్య కేంద్రాలు, ప్రాంతీయ దవాఖానలకు చేరుకునేలా కార్యచరణ ఉండాలన్నారు. అవసరమైన చోట కొత్తవి ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపాలన్నారు. దవాఖానల్లో మందులు, వైద్యులు ఉండేలా చూడాలన్నారు. వర్షాకాలం ప్రసవానికి ముందే వారం రోజుల లోపు దవాఖానలో గర్భిణీ ఉండేలా చర్యలు తీసుకోవాలని, గిరిజన ప్రాంతాల్లో స్థానిక గిరిజన భాష తెలిసేలా సిబ్బందిని నియమించాలని, 108 అంబులెన్స్ లేని ప్రాంతాల్లో ఇతర ఏర్పాట్లు చేయాలన్నారు. సమావేశంలో గిరిజన శాఖ ముఖ్యకార్యదర్శి శరత్, హెల్త్ సెక్రటరీ క్రిస్టినా జడ్ చోంగ్తూ, ఫ్యామిలీ హెల్త్ కమిషనర్ ఆర్వీ కర్ణన్, టీజీఎంఎస్ఐడీసీ ఎండీ హేమంత్ వాసుదేవ్‌రావ్, ట్రైకార్ సంచాలకుడు రవింద్రనాయక్, వైద్య విధాన పరిషత్ కమిషనర్ అజయ్, అధికారులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ ఒకరి మృతి

భైంసాటౌన్, అక్టోబర్ 3 : సుంక్లి గ్రామ శివారులోని రైసు మిల్లులో బీహార్ రాష్ట్రానికి చెందిన నితీశ్ గురువారం చికిత్స పొందుతూ మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..బుధవారం రాత్రి నితీశ్, కరన్ కిరాణ సామాను తీసుకురావడానికి బైక్‌పై సుంక్లి నుంచి వానల్‌పాడ్ గ్రామానికి వెళ్తున్నారు. మూల మలుపు వద్ద బైక్ అదుపు తప్పి చెట్టును ఢీ కొట్టింది. వెనుక కూర్చున్న కరన్ వెనక్కి దూకాడు. నితిశ్‌కు కాలు విరిగి, చాతిలో బలమైన గాయామైంది. అతడిని 108లో భైంసా ప్రభుత్వ దవాఖానకు తరలించారు. మెరుగైన చికిత్స కోసం నిర్మల్ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ శ్రీనివాస్ తెలిపారు.

30 పడకల దవాఖాన, కేంద్రీయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

బాసర, అక్టోబర్ 3 : బాసరలో 30 పడకల దవాఖాన, కేంద్రీయ విశ్వ విద్యాలయం నిర్మాణానికి స్థలాన్ని గురువారం ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్ పరిశీలించారు. ఆయన వెంట వీసీసీ సభ్యులు, నాయకులు ఉన్నారు.

మహిళను వేధించిన కేసులో ఒకరికి జైలు

కడెం, అక్టోబర్ 3 : మహిళను వేధించిన కేసులో ఒకరికి జైలు శిక్ష విధించినట్లు కడెం ఎస్ఐ కృష్ణసాగర్‌రెడ్డి తెలిపారు. లింగాపూర్ గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి గణేశ్ 2015లో ఒక మహిళను వేధించగా కడెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సంబంధిత వ్యక్తికి 2 నెలల జైలు శిక్షతో పాటు, రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ఖానాపూర్ మెజిస్ట్రేట్ జితిన్‌కుమార్ తెలిపినట్లు ఎస్ఐ తెలిపారు.

కొండా సురేఖపై బీఆర్ఎస్ నాయకుల ఆగ్రహం

ఖానాపూర్, అక్టోబర్ 3 : బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌పై మంత్రి కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని బీఆర్ఎస్ ఖానాపూర్ మండల యూత్ అధ్యక్షుడు సుద్దాల మహిపాల్ అన్నారు. గురువారం ఖానాపూర్‌లోని బీఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఒక మహిళా మంత్రి సినీ రంగంలో ఉన్న మహిళా నటులను కించపరిచేలా మాట్లాడటం సిగ్గుచేటు అని ఆగ్రహం వ్యక్తం చేశారు. కేటీఆర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పి తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే బీఆర్ఎస్ యూత్ ఆధ్వర్యంలో మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

రేషన్ లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 : ప్రభుత్వ బియ్యం పంపిణీ చేసే రేషన్ డీలర్లు లబ్ధిదారులకు అందుబాటులో ఉండాలని డీఎస్‌వో వాజీత్‌అలీ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని రేషన్ దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. పంపిణీ చేసిన బియ్యం వివరాలకు చెందిన ఆన్‌లైన్ రసీదును పరిశీలించారు. వచ్చిన బియ్యం స్టాక్ వివరాలు తెలుసుకున్నారు. ఆయన వెంట డీలర్ తౌరు ఉన్నారు.

త్వరలోనే నూతన రేషన్ కార్డులు మంజూరు

ఇంద్రవెల్లి: చౌక ధరల దుకాణాన్ని ప్రారంభిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 : రాష్ట్ర ప్రభుత్వం త్వరలోనే కొత్త రేషన్ కార్డులు మంజూరు చేసి, అర్హులైన పేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తుందని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. గురువారం మండలంలోని అంజీ, వాల్గొండా, హీరాపూర్, భీంజితండా, పిట్టబొంగురం గ్రామాల్లో నూతనంగా ఏర్పాటు చేసిన అదనపు రేషన్ దుకాణాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు ముకాడే ఉత్తమ్, మాజీ కోఆప్షన్ సభ్యుడు ఎండీ మసూద్, మాజీ మండలాధ్యక్షుడు నాగోరావ్, పట్టణ అధ్యక్షుడు ఎండి జహీర్, మాజీ సర్పంచ్‌లు సుంకట్‌రావ్, జుగాదిరావ్, మెస్రం నాగ్‌నాథ్, రాంచందర్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 3: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ రకాల సంక్షేమ పథకాలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ పేర్కొన్నారు. గురువారం ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే సమక్షంలో ఇంద్రవెల్లి మండలంలోని వివిధ పార్టీల నాయకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

పెర్సపేన్ ఆలయ నిర్మాణానికి కృషి చేయాలి

ఇంద్రవెల్లి, అక్టోబర్ 3 : బజార్‌హత్నూర్ మండలం జాతర్ల గ్రామంలో మడావి వంశీయుల పెర్సపేన్ ఆలయ నిర్మాణానికి వంశీయులందరూ కృషి చేయాలని మడావి వంశీయులు తీర్మానం చేశారు. గురువారం ఇంద్రవెల్లి, గూడిహత్నూర్ మండలానికి చెందిన మడావి వంశీయుల ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పెర్సపేన్ ఆలయ నిర్మాణంతోపాటు దేవుళ్ల ఉత్సవాలపై చర్చించారు. కార్యక్రమంలో మడావి వంశీయులు తిరుపతి, జుగదిరావ్, నగేశ్, ప్రభాకర్, శేక్‌రావ్, భీంరావ్, మారుతిరావ్, దశరథ్ పాల్గొన్నారు.

దసరా ఉత్సవాలకు భూమిపూజ

ఎదులాపురం, అక్టోబర్ 3 : విజయ దశమి పురస్కరించుకుని సనాతన హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఉత్సవాలను 12 ఏండ్ల నుంచి నిర్వహిస్తున్నామని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ అన్నారు. ప్రతి ఏటా మాదిరిగానే ఆదిలాబాద్ రాంలీలా మైదానంలో నిర్వహించనున్న ఉత్సవాలకు సంబంధించిన పనులను గురువారం భూమి పూజ చేసి ప్రారంభించారు. ఈ నెల 12వ తేదీన నిర్వహించే రావణ దహనంలో ప్రజలు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ కౌన్సిలర్ ప్రకాశ్, సనాతన హిందూ ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రి, సూర్యకాంత్, వామన్, అజయ్ పాల్గొన్నారు.

ముగిసిన మొదటి విడుత ప్రవేశాలు

ఎదులాపురం, అక్టోబర్ 3 : ఆదిలాబాద్ రిమ్స్ మెడికల్ కళాశాలలో రాష్ట్ర కోట మొదటి విడుత ఎంబీబీఎస్ ప్రవేశాలు గురువారం ముగిశాయి. రాష్ట్ర కోట మొదటి విడుత 75 సీట్ల కేటాయించగా అన్ని భర్తీ అయ్యాయి. మొదటి రోజు 42 మంది, రెండో రోజు 27 మంది ప్రవేశాలు పొందగా.. చివరి రోజు గురువారం 24 మంది ప్రవేశాలు పొందినట్లు రిమ్స్ డైరెక్టర్ రాథోడ్ జైసింగ్ తెలిపారు.

ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలి

నిర్మల్ చైన్‌గేట్, అక్టోబర్ 3 : ఎస్సీ, ఎస్టీల అభ్యున్నతికి కృషి చేయాలని రాష్ట్ర షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రాష్ట్ర కమిషన్ సభ్యులు, కలెక్టర్, ఎస్పీతో కలిసి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ జిల్లాలో ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులను త్వరగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో వివిధ శాఖల ద్వారా ఎస్సీ, ఎస్టీలకు అందుతున్న అభివృద్ధి ఫలాల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, కిశోర్‌కుమార్, ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యులు ప్రవీణ్, రాంబాబు నాయక్, శంకర్, నీలాదేవి, జిల్లా షెడ్యూల్డ్ కులాల అధికారి రాజేశ్వర్ గౌడ్, అధికారులు పాల్గొన్నారు.

ఉరి వేసుకొని ఒకరి ఆత్మహత్య

సోన్, అక్టోబర్ 3: సోన్ మండలం బొప్పారం గ్రామానికి చెందిన శివరాత్రి రవి (33) గురువారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌హెచ్ఓ తహేర్‌ఖాన్ తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. శివరాత్రి రవి కొన్ని సంవత్సరాల నుంచి మద్యానికి బానిసై ఏ పని చేయడం లేదు. ప్రతి రోజూలాగే మద్యం తాగి ఇంటి వెనుక గల రేకుల షెడ్డులో ఉరివేసుకున్నాడు. మృతుడికి భార్య, కూతు రు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

చట్టాలపై అవగాహన సదస్సు

ఎదులాపురం, అక్టోబర్ 2 : ఆదిలాబాద్‌లోని విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘ భవనంలో జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో డీఎల్ఎస్ఏ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి భోనగిరి సౌజన్య చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. డీఎల్ఎస్ఏ ద్వారా అందించే ఉచిత సేవల గురించి తెలియజేశారు. కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు లక్ష్మారెడ్డి, ఎర్రాల నగేశ్ పాల్గొన్నారు.